

బాల్యవివాహ నిషేధ చట్టాన్ని
కఠినంగా అమలు చేయాలి

● అధికారులకు కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ ఆదేశం
● గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచన

- వివరాలు 9 లో



సభలో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత అశోక్

చర్చ..రచ్చ..!



● ఉత్తర కర్ణాటక సమస్యలపై అట్టుడికిన అసెంబ్లీ ● ప్రశ్నోత్తరాలకు ముందే చర్చించాలి
● ప్రతిపక్ష నాయకుల డిమాండ్ ● వాయిదా తీర్మానం వర్తించదన్న స్పీకర్

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బెళగావి శాసనసభ శీతాకాల సమావేశాలలో ఉత్తర కర్ణాటక ప్రాంత సమస్యలపై మంగళవారం శాసనసభ అట్టుడికింది. ప్రశ్నోత్తరాలకు ముందే ఉత్తర కర్ణాటక అంశాలపై చర్చించాలని ప్రతిపక్ష నాయకులు పట్టుబట్టారు. అయితే ప్రశ్నోత్తరాలకు ముందే చర్చిస్తే వాయిదా తీర్మానం వర్తించదని స్పీకర్ యుటీ ఖాదర్ తేల్చిచెప్పారు. దీంతో ప్రశ్నోత్తరాల తర్వాత చర్చకు నిర్ణయించారు. భోజన విరామం అనంతరం ఉత్తర కర్ణాటక అంశాలపై చర్చ జరిగింది. ప్రతిపక్షనేత అశోక్ సుదీర్ఘంగా ఉత్తర కర్ణాటక అంశాలను ప్రస్తావించారు. ఇటీవల అతివృష్టితో భారీగా పంటనష్టం జరిగిందని, రైతులు నష్టపోయారన్నారు. ఉత్తర కర్ణాటక రైతులు ఏదో ఒక విధంగా నష్టపోతూనే ఉన్నారన్నారు. వరదలు లేదా కరువు వెంటాడుతోందన్నారు. ఉత్తర కర్ణాటకకు చెందిన స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలపట్ల చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ప్రతి కుటుంబ సభ్యురాలికి నెలకు రూ.2వేలు గృహలక్ష్మి ఇస్తున్నామన్నారు. అంతలోనే బీజేపీ, జేడీఎస్ సభ్యులు అభ్యంతరం తెలిపారు. గృహలక్ష్మి సక్రమంగా అందడం లేదన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చిలో విడుదల కాలేదన్నారు. ఇటీవల ఆగస్టు తర్వాత నాలుగు నెలలుగా గృహలక్ష్మి మొత్తం రాలేదన్నారు. ఆగస్టు నెలవరకు అందరికీ గృహలక్ష్మి ఇచ్చామని మంత్రి తెలిపారు. అయితే ఫిబ్రవరి, మార్చి ప్రస్తావించకపోవడంతో వాగ్వాదం సాగింది. అధికార ప్రతిపక్ష సభ్యులు ఉత్తరకర్ణాటకపై రాత్రి 7 గంటల వరకు కూడా చర్చలు జరిపారు.



మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్

ఇంటింటికీ మద్యం

● జొమాటో, స్విగ్గీల ద్వారా సరఫరా చేస్తారా?
● సభలో బీజేపీ సభ్యుడు సునీల్ కుమార్ మండిపాటు



సభలో సునీల్‌కుమార్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గృహిణికి నెలకు రెండువేల గృహలక్ష్మి ద్వారా చేయూతనిస్తోందని కానీ బెల్టు షాపులతో భర్తలను రోగాల పాలు చేస్తోందని చిక్కనాయకనహళ్ళి ఎమ్మెల్యే సురేష్‌బాబు ఆరోపించారు. శాసనసభలో అబ్కారీ శాఖా మంత్రి ఆర్‌బీ తిమ్మాపుర వివరణ ఇస్తూ బెల్టు షాపులపై నిరంతరంగా అబ్కారీ అధికారులు దాడులు చేస్తున్నారన్నారు. బీజేపీ సభ్యులు సునిల్‌కుమార్, సురేష్ కుమార్ సహా పలువురు మంత్రి వివరణను తప్పుపట్టారు. చిల్లర దుకాణాలలోను మద్యం లభిస్తోందని విచారం వ్యక్తం చేశారు. విద్యార్థులు, యువత చెడుదారి పడుతున్నారని మండిపడ్డారు. అంతలోనే బీజేపీ సభ్యుడు సురేష్‌కుమార్ మాట్లాడుతూ జొమోటో, స్విగ్గీల ద్వారా ఇంటికే మద్యం పంపిణీ చేసేలా నిర్ణయం తీసుకోండి అంటూ ఎద్దేవా చేశారు. డ్రగ్స్ కూడా ఇదే తరహాలోనే ఆన్‌లైన్ ద్వారానే సరఫరా అవుతోందన్నారు. దీంతో హోంమంత్రి పరమేశ్వర్ జోక్యం చేసుకుని ఎవరైనా ఆన్‌లైన్‌లో డ్రగ్స్ సరఫరా చేస్తుంటే వివరాలు ఇవ్వాలన్నారు. కర్ణాటకను డ్రగ్స్ రహితంగా మార్చాలనే మా లక్ష్యానికి ఎక్కడ దారితప్పేలాంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అంతలోనే సురేష్‌బాబు మాట్లాడుతూ అబ్కారీ అధికారులకు టార్గెట్‌లు పూర్తి చేసుకునేందుకే బెల్టులకు ప్రోత్సహిస్తున్నారన్నారు. దీంతో బీజేపీ సభ్యులు సభను పక్కదారి పట్టించేలాంటి చర్యలు సమంజసం కాదని రూ.43వేల కోట్ల టార్గెట్ అంటూ బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. మంత్రి తిమ్మాపుర మాట్లాడుతూ బెల్టుషాపులను తగ్గించేందుకు తగినరీతిలో దాడులు చేస్తామన్నారు.

మూడు నెలల్లో 545 పీఎస్ఐ పోస్టుల భర్తీ : హోంమంత్రి



రాష్ట్రంలోని 545 పీఎస్ఐ పోస్టుల నియామక ప్రక్రియ పూర్తై ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ ఇప్పటికే ప్రారంభమైందని హోం మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్ శాసనసభలో ప్రకటించారు. శిక్షణ ముగిసిన వెంటనే మూడు నెలల్లో ఖాళీలన్నీ భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మూడ్బిద్రి ఎమ్మెల్యే ఉమానాథ్, కొటియన్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గత ఐదు సవంత్సరాల్లో పీఎస్ఐ నియామకాలు జరగలేదని, అయితే 545 పోస్టులు నియామకానికి సంబంధించి వచ్చిన కేసులు తొలగిపోయాయన్నారు. శిక్షణ పూర్తి అయిన నియామకాలు చేపడ్తామన్నారు. పోలీస్ కానిస్టేబుళ్ల నియామకానికి కూడా ప్రతిపాదనకు ఆర్థికశాఖకు పంపామని అమోదం వచ్చిన వెంటనే నియామక ప్రక్రియ మొదలవుతుందన్నారు. తీర ప్రాంతాల్లో నేరాలు పెరుగుతున్నాయని వచ్చిన నివేదికలపై ప్రభుత్వం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని వెల్లడించారు. దేశంలోనే మొదటిసారి 50 ఇళ్లను ఒక క్లస్టర్‌గా తీసుకుని ఇంటింటికీ పోలీస్ కానిస్టేబుళ్లను పంపించి ప్రజల సమస్యలు తెలుసుకొని వెంటనే చర్యలు తీసుకునే విధానాన్ని మా ప్రభుత్వం అమలు చేసిందని ఇది ప్రజల్లో విశేష స్పందన పొందిందన్నారు. అంతేకాకుండా మహిళల భద్రత కోసం మహిళా, శిశు అభివృద్ధి శాఖతో కలిసి అక్కపాడే సిస్టర్ స్క్వాడ్ ను ఏర్పాటు చేస్తున్నాట్లు చెప్పారు. ఈ చర్యలతో రాష్ట్రంలె నేరాల శాతం తగ్గుముఖం పట్టిందని వివరించారు.

కంబళకు రాయితీల్లో తేడాలు సరికాదు..

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంత జిల్లాలలో శతాబ్దాలుగా సాగుతుండే సాంస్కృతిక పోటీలు 'కంబళ' క్రీడలు జరిపే అందరికీ ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలని బేధాభిప్రాయాలు చూపడం సరికాదని అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ సభ్యులు శాసనసభలో డిమాండ్ చేశారు. పుత్తూరు సభ్యుడు అశోక్‌కుమార్ రై సభలో ప్రస్తావిస్తూ కంబళ పోటీలకు ఏటా బడ్జెట్‌లో నికరంగా నిధులు కేటాయించాలని పట్టుబట్టారు. గత ఏడాది దక్షిణకన్నడ జిల్లాలోని 19 కంబళ పోటీలకు మాత్రమే ఐదులక్షలు చొప్పున మంజూరు చేయడాన్ని తప్పుబట్టారు. బీజేపీ సభ్యులు సునిల్‌కుమార్ సహా ఏకంగా ఐదారు మంది గ్రాంట్‌లలో తేడాలు సరికాదంటూ ఆందోళన చేశారు. దక్షిణ కన్నడ జిల్లాలో 19, ఉడుపి జిల్లాలో నాలుగు కంబళ సంఘాలు ఉన్నాయని అన్నింటికీ ఐదులక్షలు చొప్పున విడుదల చేస్తామని మంత్రి హెచ్‌కే పాటిల్ వివరించారు. దీంతో కంబళ గందరగోళానికి తెరదించినట్లు అయ్యింది. ఇదే సందర్భంలోనే స్పీకర్ మాట్లాడుతూ జనవరిలో మేం కంబళ నడుపుతున్నామని అందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పాత విధానంలోనే ఈ ఖాతాలు

● సభలో డీసీఎం డీకే శివకుమార్ హామీ

బళ్లారి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) గ్రేటర్ బెంగళూరు ప్రాంతంలో ఈ ఖాతాలు, కొత్త ఖాతాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మొత్తం 31, 274 దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే గోపాలయ్య అడిగిన డాట్ గుర్తింపుపై ప్రశ్నకు ఆయన సమాదనం ఇచ్చారు. గ్రేటర్ బెంగళూరు ప్రాంతంలో దరఖాస్తుల పెరుగుదల కారణంగా పనిభారం పెరిగిందని దాంతో పనిలో ఆలస్యం అవుతున్నట్లు గుర్తించామన్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు అవినీతి రహితంగా పారదర్శకంగా ఉండేలా ఆటోమేటెడ్ డిజిటల్ వ్యవస్థ ద్వారా ఈ ఖాతాలను జారీ చేసే విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. కొత్త సమూనా అమల్లోకి వచ్చిన తర్వాత పౌరులు పలు సాంకేతిక సమస్యలు ఆలస్యాలు, అప్రమత్తత లోపాలు ఎదుర్కొంటున్నారని శాసనసభ సభ్యులు ప్రస్తావించారు. ప్రజలకు ఇబ్బందులు తగ్గించే దిశగా అనేక సూచనల్లు సభలో లేవనెత్తబడ్డాయి. మునుపటిలాగే పాత వ్యవస్థలోనే ఈ ఖాతాలను జారీ చేసే విధానాన్ని పునరుద్దరిస్తామన్నారు.

మద్యం అమ్మకాలపై టార్గెట్ లేదు : మంత్రి ఆర్‌బీ

ఎక్సైజ్ శాఖకు మద్యం అమ్మకాల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ధేశించిందనే ఆరోపణలను రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి ఆర్‌బీ తిమ్మాపూర్ ఖండించారు. ఎక్సైజ్ శాఖకు ఏవిధమైన టార్గెట్ విధించలేదన్నారు. కేవలం ఆదాయ అంచనా మాత్రమే ఉంటుంది అని స్పష్టం చేశారు. చిక్కనాయకనహళ్లి ఎమ్మెల్యే సీబీ సురేష్ బాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సభలో సమాధానమిచ్చారు. గ్రామీణ ప్రదేశాల్లో చిన్న దుకాణాల్లో చట్టవిరుద్ధ మద్యం విక్రయాలు జరుగుతున్నాట్లు వచ్చిన ఫిర్యాదులను తీవ్రంగా పరిగణిస్తున్నామని, మహిళలు, పిల్లలు మద్యానికి బానిసలవుతున్న సమస్యను ప్రభుత్వం గంభీరంగా చూస్తోంది. అక్రమ మద్యం నివారణ కోసం నిరంతరం దాడులు కొనసాగిస్తున్నాం అన్నారు. మూడేళ్లల్లో 721 ఎక్సైజ్ దాడు, 491 కేసులు నమోదు, 448 మందిని అరెస్టు, 641 లీటర్లు అక్రమ మద్యం స్వాధీనం, 16 వాహనాల జప్తు, రూ. 12.69 లక్షల జరిమానాల అక్రమ మద్యం రవాణా అరికట్టేందుకు జాతీయ, రాష్ట్ర రహదారులపై రాత్రి గస్తీ, వాహన తనిఖీలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయని మంత్రి వివరించారు.

2500 మంది రైతుల ఆత్మహత్య

● రెండున్నరేళ్లలో అన్నదాతకు కష్టాలే ● విజయేంద్ర మండిపాటు ● సువర్ణసౌధ ముట్టడికి తరలివచ్చిన రైతులు





ఆందోళనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

← నిరసనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర , బీజేపీ నాయకులు

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెండున్నరేళ్ల కాంగ్రెస్‌పాలనలో సాధించింది శూన్యమని, ఏకంగా 2500 మంది అన్నదాతలు అప్పులు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడ్డారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర మండిపడ్డారు. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీజేపీ నిరసన చేపట్టింది. సువర్ణసౌధకు సమీపంలోని మాలిని సిటీ మైదానంలో మంగళవారం ఆందోళన చేశారు. సువర్ణసౌధ ముట్టడి పేరుతో జరిగిన నిరసన ర్యాలీలో విజయేంద్ర మాట్లాడుతూ రైతు వ్యతిరేక ప్రభుత్వానికి మనుగడ ఉండదని హెచ్చరించారు. రైతు సమస్యలపై స్పందించరా అంటూ ప్రశ్నించారు. వరి, చెరకు, పత్తి, మొక్కజొన్న పంటల సాగు చేసిన రైతులు దిగుబడి ఆశాజనకంగా ఉందని భావించిన తరుణంలోనే అతివృష్టి భారీ దెబ్బ తీసిందన్నారు. మరోవైపు ఏ పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అతివృష్టి జరిగినప్పుడు ముఖ్యమంత్రి నేలమీద తిరగలేదన్నారు. కాంగ్రెస్ ప్రతిసారి రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు ఎఫ్ఆర్‌పీ కంటే ఎక్కువ కనీస మద్దతు ధరకు అవకాశం ఉన్నా సీఎం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఇదో సిగ్గులేని ప్రభుత్వమన్నారు. ఉత్తరకర్ణాటక సమస్యలపై చర్చలు నిరంతరం పోరాటం చేస్తామన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా పాటుపడిన యడియూరప్ప కుమారుడిగా బీజేపీ అధ్యక్షుడిగా రైతుల తరుపున నిరంతరం అండగా ఉంటానన్నారు ప్రతిపక్షనేత ఆర్ అశోక్ మాట్లాడుతూ రైతుల ధ్వనిగా సువర్ణసౌధను ముట్టడించేందుకు పిలుపునిస్తే భారీగా రైతులు తరలివచ్చారన్నారు. సభలోనే కాకుండా బయటా పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన నిర్జీవంగా మారిందన్నారు. రాష్ట్రంలో అన్నింటికంటే అతివృష్టితో భారీగా నష్టం జరిగిందన్నారు. పత్తి, కంది, ఉద్దులు సాగు చేసిన వారు నష్టపోయి అప్పుల పాలయ్యారన్నారు. పరిషత్ ప్రతిపక్ష విప్ రవికుమార్ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ప్రభుత్వాన్ని వదులుకోవాలని డిమాండ్ చేశారు. విధానపరిషత్ సభ్యుడు సీటీ రవి సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యులయ్యారు. బెళగావి ప్రాంత సంప్రదాయ తలపాగాలతో నాయకులు నిరసనలో పాల్గొన్నారు



నూతనంగా ఏర్పాటు చేసిన లోక్‌భవన్ బోర్డు

రాజ్‌భవన్ ఇక లోక్‌భవన్

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ అధికారిక భవన్‌ను దశాబ్దాలుగా రాజ్‌భవన్‌గా పిలిచేవారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా రాజ్‌భవన్ పేరు మారింది. దేశవ్యాప్తంగా రాజ్‌భవన్‌లకు లోక్‌భవన్‌లుగా పేర్లు మార్చుతూ ఇటీవలే కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగానే రాజ్‌భవన్ పేరిట ఉండే బోర్డును మంగళవారం లోకభవన్‌గా మార్పు చేశారు. బోర్డు మాత్రమే తాజాగా మార్పు చేసినా కేంద్రప్రభుత్వ ఆదేశాలు జారీ అయిన రోజు నుంచే అధికారిక ఉత్తర్వులు లోక్‌భవన్ పేరుతోనే సాగుతున్నాయి.

ఆర్టీసీ బస్సు బోల్తా.. కండక్టర్ మృతి



బోల్తా పడ్డ ఆర్టీసీ బస్సు

● గాయపడ్డ విద్యార్థులు.. ప్రయాణికులు

రాయచూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అకస్మాత్తుగా స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ సంఘటన మంగళవారం ఉదయం దేవదుర్గ తాలూకాలోని అంజళ క్రాస్ వద్ద జరిగింది. అంజలి నుంచి దేవదుర్గకు వస్తున్న ఈ బస్సులో విద్యార్థులతో కలిపి మొత్తం 40 మందికి పైగా ప్రయాణికులున్నారు. వేగంగా వెళ్తున్న బస్సు ఒక్కసారిగా అదుపు తప్పి పడిపోవడంతో కండక్టర్ బసవరాజ్(36) తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతు కన్ను మూశారు. మృతి చెందిన కండక్టర్ బసవరాజ్ లింగసుగూరు తాలూకా నేరలకేరే గ్రామానికి చెందిన వాడు. గడచిన 7 ఏళ్లుగా ఆయన జిల్లాలోని దేవదుర్గ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కండక్టర్ మృతితో సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కాగా బస్సులో ప్రయాణిస్తున్న ఇద్దరు వయోవృద్ధులు, 19 మంది విద్యార్థులతో పాటు మొత్తం 23 మందికి గాయాలైయ్యాయి. ఈ బస్సులో కళాశాలలు పాఠశాలలకు (మిగతా7వ పేజీలో)

నేనే నిజమైన ప్రతిపక్షనేతను...
అడ్జెస్ట్‌మెంట్ రాజకీయనేతను కాను

7

● ఆరుసార్లు గెలిచా నాకు వెనుక సీటు వేస్తారా
● కృష్ణభాగ్య పరిహారం అన్యాయం అంటూ యత్నాళ్ వాకౌట్

అమ్మా క్షమించు...!

● ప్రేమ పేరుతో మోసపోయాను ● లేఖరాసి యువతి ఆత్మహత్య



బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమ్మా నన్ను క్షమించు, ఇష్టం లేకున్నా తప్పు చేశా.. ఈ శరీరం మట్టిలో కలసిపోవాల్సిందేఅంటూ డెత్‌నోట్ రాసి యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. ప్రేమ పేరిట కుట్రలో ఇరుక్కుపోయానని, తన ప్రైవేట్ ఫొటోలు చూపి బెదిరించి లైంగికంగా వాడుకుని వంచించారని ఆ బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు డెత్‌నోట్‌లో పేర్కొంది. బెంగళూరు దక్షిణ జిల్లాకు చెందిన ఓ యువతి (22) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మైసూరు లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంఎస్‌సీ చదువుతోంది. తుమకూరు జిల్లా కుణిగల్‌కు చెందిన అభి (28) అనే యువకుడు బ్లాక్‌మెయిల్ చేసి మోసం చేశాడని డెత్‌నోట్‌లో పేర్కొంది. ప్రైవేట్ ఫొటోలతో బెదిరించి లైంగికంగా సహకరించాలని ఒత్తిడి చేశాడని, ఫొటోలను డిలీట్ చేస్తాననడంతో ఇష్టం లేకున్నా తప్పు చేశానని వాపోయింది. ఫలితంగా గర్భం దాల్చాక అతనే గర్భస్రావం చేయించాడని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం బతుకుపై ఆశ లేదని అందుకే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు పేర్కొంది. అమ్మా సాధ్యమైతే క్షమించాలని రాసుకుందని పోలీసులు తెలిపారు. రామనగర రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మిరప పొలంలో గంజాయి సాగు

● పోలీసుల దాడి.. 44 మొక్కలు స్వాధీనం ● బళ్లారి జిల్లాలో వెలుగులోకి

బళ్లారిరూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మిరప పొలంలో గంజాయి సాగు చేస్తున్న సంగతి బళ్లారి జిల్లాలో వెలుగులోకి వచ్చింది. బళ్లారిరూరల్ మోకా పరిధి గోటూరు సమీపంలో సర్వే నెంబర్ 31లో సాగు చేస్తున్న గంజాయిని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ. ఐదు లక్షలు విలువైన 44 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మిరప పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు దాడులు నిర్వహించారు. దాదాపు 44 గంజాయి మొక్కలను పెంచారని పోలీసులు తెలిపారు. దాడుల్లో అబ్కారీ డీసీ మంజునాథ్, డీఎస్పీ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.



మిరప పొలంలో గంజాయిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

ఏమిటీ నిర్లక్ష్యం..?

మీ పిల్లలకు ఇలాగే పెడతారా..?

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి ఆగ్రహం

నాగసముద్రం హెచ్ఎంకు షోకాజ్



కాలంచెల్లిన చిక్కీలను పరిశీలిస్తున్న గంజిమల దేవి



సీకేపల్లి ఉన్నత పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తూ...

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'పిల్లలకు నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడటం లేదు.. ఇక్కడ పూర్తి నిర్లక్ష్యం, అజాగ్రత్త కనిపిస్తున్నాయి.. ఇంట్లో మీ పిల్లలను ఇలాగే చూసుకుంటారా..? వారికి ఏదైనా జరిగితే ఎవరిది బాధ్యత..? నిర్లక్ష్యంతో పిల్లల జీవితాలతో ఆడుకుంటారా..? కాలంచెల్లిన చిక్కీలు పాఠశాలలో ఎందుకు ఉన్నాయి..' అంటూ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నాగసముద్రం ప్రాథమిక పాఠశాల హెచ్ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈవోను ఆదేశించారు. చెన్నేకొత్తపల్లి మండలంలో ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నాగసముద్రం ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో కట్టెల పొయ్యిపై వంట తయారు చేయడం, అరకొర సరుకులు, కాలం చెల్లిన చిక్కీలు కనిపించడంతో ఆమె ప్రధానోపాధ్యాయుడు సాయినాథ్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పైనా ఫోన్‌లో మండిపడ్డారు. హెచ్ఎం సాయినాథ్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీచేయాలని అక్కడే ఉన్న డీఈవో కిష్టప్పను ఆదేశించారు. కాంట్రాక్టర్ లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకు ముందు ఉదయం చెన్నేకొత్తపల్లిలో ఆమె విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్సీ బాలుర హాస్టల్, అంగన్‌వాడీ కేంద్రాలు, పౌరసరఫరాల స్టాక్ పాయింట్, ఉన్నత పాఠశాల, కేజీబీవీ, ప్రభుత్వ చౌక ధాన్యపు డిపోలను తనిఖీ చేశారు. కోడిగుడ్లు చిన్నగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కేజీబీవీలో తరగతులకు వెళ్లి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని బాలికలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ పాయింట్‌లో బియ్యం బస్తాల తూకాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందిస్తున్న తీరును అడిగితెలుసుకున్నారు. రేషన్‌షాపును సందర్శించి పంపిణీని పరిశీలించారు. స్టాక్ పాయింట్ నుంచి వచ్చే ధాన్యం తూకాలలో తేడాలుంటున్నాయని, ఈ నెల కోటాలో 68 కిలోలు తక్కువ ఉందని డీలర్ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై విచారించి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. తనిఖీల్లో పౌరసరఫరాలశాఖ ఏడీఎం సాయి, ఏఎస్ఓ సింధూబాయి, ఐసీడీఎస్ పీడీ ప్రమీల, డీఈఓ క్రిష్టప్ప, తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీడీఓ బాలకృష్ణుడు, ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు, సీడీపీఓ కవితాదేవి తదితరులు ఉన్నారు.

మీ ఎమ్మెల్యే బాగా పనిచేస్తున్నారా..?

అనంతపురం క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయింది. త్వరలో స్థానిక ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో అసెంబ్లీ సెగ్మెంట్లలో మకుటంలేని మహారాజులుగా చలామణి అవుతున్న ఎమ్మెల్యేల పనితీరును తెలుకోవడానికి టీడీపీ హైకమాండ్ సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల పనితీరు ఎలా ఉంది? బాగా పనిచేస్తున్నారా..? పర్వాలేదా...? బాగా చేయడం లేదా..? అన్న కోణాల్లో ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఏ పార్టీకి ఓటువేస్తారు అని ఆరా తీస్తున్నారు. చాలా నియోజకవర్గాల్లోని ప్రజలు, పార్టీ నాయకులకు మంగళవారం ఫోన్లు వచ్చాయని తెలిసింది.

అక్కడక్కడ అసమ్మతి రాగాలు

వైసీపీ పాలనలో అనేక ఇబ్బందులు పడిన టీడీపీ సీనియర్ నాయకులు ఎందరో ఉన్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 18 నెలలు గడిచినా వారికి పార్టీ పదవులుగాని, నామినేటెడ్ పదవులుగాని దక్కక తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలిసింది. కొందరు జూనియర్లకు అవకాశాలు కల్పించి, పాతికేళ్లుగా పార్టీనే నమ్ముకున్న తమకు చాన్స్ ఇవ్వలేదని పలువురు సీనియర్ నాయకుల్లో కాస్త అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఐదారేళ్ల కింద పార్టీలోకి వచ్చిన వారికి, జూనియర్లను సైతం డైరెక్టర్, ఇతర పదవులు వరించాయి. దీంతో పోస్టులు వచ్చినవాళ్లు ఆనందంగా ఉంటే...దశాబ్దాల పాటు పార్టీని అంటిపెట్టుకుని ఉన్న సీనియర్లకు పదవులు దక్కపోవడంతో వారితో కొందరిలో అసమ్మతి కనిపిస్తోంది. దీనికితోడు గత ఐదేళ్లు కష్టపడినా తమను గుర్తించడంలేదన్న ఆవేదన కూడా కొందరు తెలుగు తమ్ముళ్ల గళం నుంచి వినిపిస్తోంది. ఇదే విషయాన్ని ఇటీవల కొందరు పార్టీ హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కళ్యాణదుర్గం వచ్చినప్పుడు కూడా కొందరు ఆయన దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. 'మీరు ఇళ్లలో కూర్చొని బాధపడితే మాకు ఎలా తెలుస్తుంది? సమస్య ఏదైనా మా దృష్టికి తీసుకురావాలి' అంటూ లోకేశ్ పార్టీ శ్రేణులకు సూచించారు.

స్థానిక సమరానికి సిద్ధమేనా...?

మరో ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం తథ్యమని పార్టీ వర్గాల సమాచారం. ప్రస్తుతం మెజారిటీ స్థానిక సంస్థల్లో వైసీపీ ప్రజాప్రతినిధులే ఉన్నారు. మున్సిపాలిటీలు, పంచాయతీలు, జిల్లాపరిషత్‌లో వైసీపీ నాయకులే ప్రజాప్రతినిధులుగా కొనసాగుతున్నారు. నాటి మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రంలో తాడిపత్రి మినహా అన్నీ వైసీపీ కైవసం చేసుకుంది. పంచాయతీ ఎన్నికల్లోనూ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీనే మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది. స్థానిక నేతల పదవీకాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో కొన్ని చోట్ల వైసీపీ నాయకులు దాడులకు దిగుతున్నారు. పంచాయతీల పాలనా గడువు వచ్చే ఏప్రిల్, మున్సిపాలిటీల గడువు మార్చిలో ముగియనుంది. ఇన్నాళ్లు అధికారాన్ని అనుభవించిన వైసీపీ నాయకులు...ఇప్పుడు టీడీపీ నేతల చేతుల్లోకి అధికారం పోతోందన్న అక్కసుతో తెలుగుతమ్ముళ్లపై దాడులకు తెగబడుతున్నారు. దీంతో గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లో రాజకీయ వేడి రాజుకుంటోంది. మరో వైపు కూటమి ప్రభుత్వం త్వరలో స్థానిక ఎన్నికలకు వెళ్లేందుకు సమాయత్తం అవుతోంది. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ఎన్నికల హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వంపై సర్వత్రా సానుకూలత వ్యక్తం అవుతోంది. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు లబ్ధిదారులకు ప్రభుత్వం పట్ల సానుకూలత పెంచినట్లు స్పష్టం అవుతోంది. స్థానిక ఎన్నికల్లోనూ విజయం సాధించాలనే ఆలోచనలో అధికారపార్టీ ఉంది.

ఆరోజు రాత్రి ఏం జరిగింది?

హిందూపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన హవాలా నగదు దోపిడీ కేసు ఛేదించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. దోపిడీ జరిగిన రోజు రాత్రి ఏం జరిగింది? ఎలా జరిగింది? దోచుకున్నవారు ఎక్కడి నుంచి వచ్చారు? అనే విషయాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 3న తెల్లవారుజామున 3-08గంటలకు పెనుకొండ మండలం హరిపురం వైజంక్షన్ వద్ద హవాలా నగదు తరలిస్తున్న వాహనాన్ని ఐదు వాహనాల్లో వచ్చిన గ్యాంగ్ అటకాయించింది. తర్వాత వాహనంలోని రూ.3.10కోట్లు దోచేసింది. అయితే అటుగా వెళ్తున్న ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడ జరుగుతున్న తతంగంపై పెనుకొండ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు జాతీయరహదారిపై తనిఖీలు చేపట్టారు. దీంతో పెనుకొండ ఆర్టీఓ కార్యాలయం వద్ద రెండు కార్లు ఆగి ఉండటాన్ని గుర్తించి అటుగా వెళ్లారు. పోలీసు వాహనాలు చూడగానే దుండగులు హవాలా కారును అక్కడే వదిలేసి వేరే కారులో ఉడాయించారు. దీంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అయితే డబ్బు దోచుకెళ్లిన దుండగులు నగదు తరలిస్తున్న వాహన డ్రైవర్‌లను కొంతదూరం తీసుకెళ్లి వదిలేశారు. వారు డబ్బున్న వాహనం జీపీఎస్ ట్రాకింగ్‌తో పెనుకొండ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. వారు వచ్చాక అసలు విషయం పోలీసులు తెలుసుకుని అందులో రూ.1.20కోట్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

వెంటబడిన వాహనాలు ఎక్కడివి?

హవాలా నగదు దోపిడీ కేసు నమోదు చేసిన పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. దోపిడీకి ముందు ఆరోజు రాత్రి ఏం జరిగింది? డబ్బు తరలిస్తున్న వాహనాన్ని వెంబడించిన వాహనాలు ఎక్కడివి? అవి ఎక్కడి నుంచి వచ్చాయి? ఏ రహదారిలో వచ్చాయనే దానిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. అసలు ఆరోజు రాత్రి నగదున్న వాహనం ఎక్కడెక్కడ ఆపారు? అక్కడ వాహనాలు ఏవైనా అనుసరించాయా? వెంటాడిన వాహనాలు ఏ రాష్ట్రానికి చెందినవి? ఆ దుండగులు ఎవరనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నగదు సూరత్ నుంచి బెంగళూరుకు వెళ్తున్నట్లు వాహన డ్రైవర్లు చెప్పారు. ఈ కారులో నగదు ఉన్నట్లు దోపిడీ చేసిన దుండగులకు ఎలా తెలుసు? వారు ఈ వాహనాన్ని ఎలా పసిగట్టారు అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. దోపిడీ చేయడానికి ముందుగా ప్లాన్ చేసుకున్నారా? లేక అప్పటికప్పుడే స్కెచ్ వేశారా అనే కోణంలో విచారణ చేపట్టారు. ఈ వాహనాల కోసం పోలీసులు వేటాడుతున్నారు.

దోపిడీ గ్యాంగ్ ఎక్కడిది ?

ఇలాంటి ఘటనలు మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎప్పుడైనా జరిగాయా? జరిగి ఉంటే ఎప్పుడు ఎక్కడ జరిగింది ఏ తరహాలో దోపిడీ చేసిందన్న విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఒక వేళ దోపిడీ ఘటనలు జరిగి ఉంటే ఆ గ్యాంగ్ ఏ రాష్ట్రానికి చెందినదన్న విషయంపై పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 2022లో ఈ తరహాలోనే రాప్తాడు వద్ద జరిగినట్లు తెలిసింది. అయితే నగదు ఇంతపెద్ద మొత్తంలో తరలిస్తున్నట్లు ఆ గ్యాంగ్‌కు ముందుగానే ఎలా తెలిసి ఉంటుంది? వాహనాన్ని సినిమా ఫక్కీలో అడ్డగించి డ్రైవర్లను కిడ్నాప్‌చేసి నగదును దోచుకెళ్లిన ఘటనను చూస్తే ఇది ముందస్తు ప్రణాళిక ప్రకారమే జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అలా ముందుగా స్కెచ్ వేయాలంటే ఆ డబ్బు ఎక్కడి నుంచి తరలిస్తున్నారన్న సమాచారం వారికి ముందుగానే పక్కాగా తెలిసి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు.

ఆధారాల సేకరణలో అధికారులు

ఈ కేసు ఛేదించడానికి పోలీసులు బలమైన ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఆ రోజు రాత్రి హవాలా నగదు తరలించే వాహన డ్రైవర్లు సూరత్ నుంచి వస్తూ ఎక్కడెక్కడ వాహనాన్ని ఆపారు, ఆపి ఉంటే వారు అక్కడ ఎవరితోనైనా మాట్లాడారా? ముఖ్యంగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక బెంగళూరు వరకు ఆరోజు రాత్రి సీసీపుటేజీలు తీసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. నగదు తరలించే వాహనంపై పడిన వేలిముద్రలు సేకరిస్తున్నారు. దీనిపై రెండు బృందాలు కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణలో గాలిస్తున్నాయి.

ప్రాణంపోసిన పెద్దాస్పత్రి

● పాముకాటు నుంచి కోలుకున్న శివరామరాజు



శివరామరాజుతో తల్లి లక్ష్మి, డాక్టర్లు

అనంతపురం వైద్యం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఒక చిన్నారి మృతిచెందగా, మరో చిన్నారికి పెద్దాస్పత్రి వైద్యులు ప్రాణం పోశారు. దీంతో తల్లిదండ్రులు వీరనారాయణస్వామి, లక్ష్మి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. 'చిన్న కుమారుడిని కోల్పోయాం.. పెద్ద కుమారుడికి పునర్జన్మనిచ్చిన పెద్దాస్పత్రి డాక్టర్లు మా దేవుళ్లు' అని లక్ష్మి అన్నారు. పెద్దవడూరు మండలం కండ్లగూడురుకు చెందిన వీరనారాయణస్వామి, లక్ష్మి దంపతులకు శివనారాయణ(7), శివరామరాజు(10) సంతానం. ఈ నెల 2వ తేదీన నలుగురూ ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఇద్దరు చిన్నారులను కట్లపాము కాటు వేసింది. ఇద్దరినీ పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, శివనారాయణ మృతి చెందాడు. ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న శివరామరాజును అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకువచ్చారు. నాలుగురోజుల శివరామరాజు కోమాలో ఉన్నాడు. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో వైద్యులు చికిత్స అందించి, ప్రాణాలను నిలబెట్టారు. కోలుకున్న శివరామరాజును సోమవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, వైద్య బృందానికి లక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు. బాలుడు అడ్మిషన్ అయిన వెంటనే పాము కాటు లక్షణాలను వైద్యులు గుర్తించారని, విరుగుడుకు తగిన మందులు ఇచ్చారని సూపరింటెండెంట్ తెలిపారు. కృత్రిమంగా శ్వాస అందిస్తూ, నిరంతరం పర్యవేక్షిస్తూ.. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది బాలుడి ప్రాణాలను నిలిపారని అభినందించారు. కార్యక్రమంలో చిన్నపిల్లల విభాగం వైద్యులు ప్రవీణ్‌డీన్ కుమార్, భాస్కర్ నాయక్, సంజీవప్ప, మమత, ప్రత్యూష, రాధిక, నర్సింగ్ సూపరింటెండెంట్ నిర్మలాబాయి తదితరులు పాల్గొన్నారు.

మూత దిశగా..!

సమస్యల వలయంలో తపాలా ఆధార్ సెంటర్లు

14కిగాను ఆరు మాత్రమే వినియోగంలో...

మిగిలినవి తాత్కాలికంగా మూత

టెక్నికల్, సిస్టం, సర్వర్ సమస్యలతోనే..

కొరవడిన పర్యవేక్షణ

గ్రామీణ ప్రజలకు తప్పని తిప్పలు



ఆధార్ కేంద్రం వద్ద వేచి ఉన్న కార్డుదారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తపాలాశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆధార్ సెంటర్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ ఆధార్ సెంటర్లను ప్రవేశపెట్టింది. వాటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అవి మూత దిశగా పయనిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా తపాలాశాఖ ఆధ్వర్యంలో 14 ఆధార్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. మొదట్లో అన్నీ సక్రమంగానే పనిచేశాయి. రానురాను పర్యవేక్షణ లోపించడం, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంలో కొందరు అధికారుల నిర్లక్ష్యం వెరసి ఆధార్ సెంటర్లు తాత్కాలికంగా మూతవేయాల్సిన దుస్థితి దాపురించింది. జిల్లావ్యాప్తంగా 14 సెంటర్లు ఉండగా... అందులో గుంతకల్లు హెచ్ఓ, అనంతపురం హెచ్ఓ, జూర్జిపేట ఎస్ఓ, యాడికి ఎస్ఓ, నార్పల ఎస్ఓ, తిమ్మనచర్ల ఎస్ఓల్లో మాత్రమే ఆధార్ సెంటర్లు వినియోగంలో ఉన్నాయి. గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, పామిడి, కణేకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, ఎస్‌పీపురంలో తపాలా ఆధార్ సెంటర్లు తాత్కాలికంగా మూతవేశారు. వీటిలో ప్రధానంగా కళ్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు, ఉరవకొండ ప్రాంతాల్లో గిరిజన ప్రజలు ఎక్కువగా ఉండటంతో అక్కడ సెంటర్లు ఏర్పాటు చేశారు. అవి పనిచేయకపోవడంతో గిరిజన ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అన్నీ సమస్యలే..

తపాలా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లకు నిత్యం ఏదో ఒక సమస్య పట్టి పీడిస్తోందనే చెప్పాలి. సర్వర్ సమస్య గురించి చెప్పక్కర్లేదు. ఏ సెంటర్‌లో చూసినా ఈ సమస్య సర్వసాధారణం అయిందనే చెప్పాలి. మిగిలిన చోట్ల టెక్నికల్, సిస్టం సమస్యలతో సెంటర్లు దాదాపు మూతదశకు చేరుకున్నాయి. వీటిని ఎప్పకటిప్పుడు పర్యవేక్షించాల్సిన ఆయా హెచ్ఓ, ఎస్ఓల్లో అధికారులు వాటి గురించి పట్టించుకోకపోవడంతో సమస్య తలెత్తుతోందనే చెప్పాలి. సమస్యను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు తెలియజేయాల్సిన ఆయా పోస్టాఫీసుల్లోని సిబ్బంది కారణమనడంలో సందేహం లేదు.



అన్ని కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం

జిల్లాలో తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధార్ సెంటర్లలో కొన్ని పనిచేయని విషయం వాస్తవమే. ఇప్పటికే ఎక్కడెక్కడ పనిచేయడం లేదో.. ఆయా సెంటర్ల వివరాలను సేకరించాం. వాటికి సంబంధించి ఇప్పటికే టెక్నీషియన్లతో సమస్యను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. డిసెంబరు నాటికి జిల్లాలోని అన్ని తపాలా శాఖల్లోని ఆధార్ సెంటర్లను వినియోగంలోకి తెస్తాం... ప్రజలకు అసౌకర్యం కలగకుండా సేవలు అందిస్తాం.

- అమర్‌నాథ్, సూపరింటెండెంట్, తపాలాశాఖ



క్రికెట్ మైదానంలో నిర్వహించిన పూజలు

చర్యలు తీసుకోవాలి: శివశంకర్, నల్లచెరువు



మండలంలో కొద్ది రోజులుగా గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో స్థానిక గీతామందిరం ఎదురుగా, అలాగే కొద్ది రోజుల కిందట స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, శుక్రవారం అర్ధరాత్రి మేము నివాసముంటున్న ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించారు. ఇది ఎవరు చేస్తున్నది అర్థం కావడం లేదు. ఆకతాయిల పనా లేదా గుప్తనిధుల కోసం చేస్తున్న పూజలా అనే అనుమానం కలుగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి పూజలు నిర్వహిస్తున్న దుండగులను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలి.

ఓం.. భీం.. బుష్..

నల్లచెరువు మండలంలో క్షుద్రపూజల కలకలం

● ప్రతి పది రోజులకు ఏదో ఒకచోట.. ● భయాందోళనలో ప్రజలు





ఆర్ఎంపీ ఇంటి ముందు నిర్వహించిన క్షుద్రపూజలు

నల్లచెరువు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాకెట్ యుగంలో కూడా కొందరు మాయగాళ్లు మంత్రతంత్రాలు అంటూ అమాయకులను భయపెడుతున్నారు. ప్రజల మూఢనమ్మకాలు, భయమే పెట్టుబడిగా మండలంలో కొందరు మాయగాళ్లు పెచ్చుమీరిపోతున్నారు. అనేక గ్రామాలలో ప్రతి పది రోజులకు ఒకసారి క్షుద్రపూజల కలకలం రేగుతోంది. వారం రోజుల కిందట స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గుర్తు తెలియని వ్యక్తులు తరగతి గది వద్ద రకరకాలైన ముగ్గులు వేసి అందులో నిమ్మకాయలు ఉంచి పసుపు, కుంకుమతో పూజ నిర్వహించారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారికి సమీపాన ఉన్న ఆర్ఎంపీ శివశంకర్ ఇంటి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు గత శుక్రవారం రకరకాల ముగ్గులు వేసి పూలు, నల్లేరు, నిమ్మకాయలతో పాటు ఒక బొమ్మను సైతం ముగ్గులో వేసి పూజలు నిర్వహించినట్లు స్థానికులు గుర్తించారు. ఎప్పుడూ జనసంచారం ఉన్న ప్రాంతంలోనే క్షుద్రపూజ నిర్వహించడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ఇలాంటి సంఘటనలు చాలానే జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిఘా ఉంచాం



మండలంలో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేస్తున్న సంగతి మా దృష్టికి వచ్చింది. పూజలు చేసే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. అతి త్వరలోనే వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- మక్బూల్ బాషా, ఎస్ఐ, నల్లచెరువు

పనిచేయని సీసీ కెమెరాలు

మండల కేంద్రంలో జాతీయ రహదారిపై గతంలో పోలీసు అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. అయితే అవి గత కొన్నినెలలుగా పని చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఇంత జరుగుతున్నా పోలీసులు అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షుద్రపూజలు నిర్వహిస్తున్న గుర్తుతెలియని దుండగులపై నిఘా ఉంచి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నకిలీ నోట్ల ముఠా అరెస్టు

బత్తలపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నకిలీ నోట్లను చలామణి చేసే ముఠాను అరెస్టు చేసినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్ఐ సోమశేఖర్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నకిలీనోట్లను విక్రయిస్తున్న కడప జిల్లా తాళ్లప్రొద్దుటూరుకు చెందిన బొడేపల్లి అంజి, ఓబులేసు, తాడిపత్రి మండలం బోడాయిపల్లికి చెందిన రాజకుళ్లాయప్పను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. బోడేపల్లి అంజి, అతడి మిత్రుడు చామలూరు ఓబులేసుకు నకిలీ నోట్ల గురించి చెప్పాడు. రూ.లక్ష నగదు ఇస్తే.. మూడు లక్షల విలువైన నకిలీ నోట్లు ఇస్తారని తెలిపాడు. ఓబులేసు రాజకుళ్లాయప్ప ద్వారా కమలాపురం గ్రామానికి చెందిన వీరాంజనేయరెడ్డితో మాట్లాడుకున్నారు. ఆ మేరకు గత నెల 18న మండలంలోని సంజీవపురం ఆర్చ్ వద్ద నకిలీ నోట్లను వీరాంజనేయరెడ్డికి చూపించారు. సమ్మతించిన వీరాంజనేయరెడ్డి 19న మరోసారి సంజీవపురం వద్దకు వచ్చాడు. ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన బాలు, హ రి ద్వారా అసలైన నోట్లు రూ.3లక్షలు ఇచ్చి.. నకిలీ నోట్లు రూ.9లక్షలు తీసుకొని వెళ్లిపోయారు. వారు ఇచ్చిన నకిలీ నోట్లు సరైనవి కావని గుర్తించిన వీ రాంజనేయరెడ్డి అంజి, ఓబులేసుతో డబ్బు విషయమై మాట్లాడాలని వెంకటగారిపల్లి క్రాస్ వద్దకు రమ్మన్నారు. దొంగ నోట్ల ముఠా సోమవారం రాత్రి గొడవ పడుతుండగా పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దొంగనోట్ల ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.




దొంగ నోట్ల ముఠాను అరెస్టు చూపుతున్న పోలీసులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సి. రాజగోపాలాచారి (జయంతి)




'భారతరత్న' పురస్కారం అందుకున్న తొలి వ్యక్తి, రాజాజీగా పేరొందిన చక్రవర్తి రాజగోపాలాచారి 1878 డిసెంబరు 10న తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా తోరపల్లి గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు, రాజకీయవేత్త, స్వతంత్ర భారత తొలి, చివరి గవర్నర్ జనరల్. సంయుక్త మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా 1937లో పనిచేశారు. కాగా 1900లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేసి సామాజిక, రాజకీయ స్థితిగతులపై ఆసక్తి చూపారు. మహాత్మాగాంధీ పిలుపుతో న్యాయవాద వృత్తిని వీడి స్వాతంత్ర్య ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమాల్లో పాల్గొన్నారు. తమిళనాడు కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షులుగా వ్యవహరించారు. కాగా తమిళంలో సాహిత్యసేవలకు సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. ఆధునిక భారతదేశం కోసం కృషి చేసిన ఆయన 94వ యేట 1972 డిసెంబరు 25న కన్నుమూశారు.

కట్టమంచి రామలింగారెడ్డి (జయంతి)



ప్రముఖ విద్యావేత్త సీఆర్ రెడ్డిగా ప్రసిద్ధిచెందిన డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి 1880 డిసెంబరు 10న చిత్తూరు జిల్లా కట్టమంచి గ్రామంలో జన్మించారు. సాహితీవేత్త, పండితుడు, వక్త, రచయిత, హేతువాది, ఆదర్శ వాదిగా, రాజనీతిజ్ఞుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆంధ్రభాషా రంజని సంఘంలో చురుకైన పాత్ర పోషించారు. బరోడా కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, మైసూరులో విద్యాశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా వ్యవహరించారు. ఆజన్మాంతం బ్రహ్మచారిగా జీవించారు. అర్థశాస్త్రంపై ఆయన రాసిన పుస్తకాలు ఆంధ్రవిజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ప్రచురించింది. 1951 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

అల్ఫ్రెడ్ బెర్న్‌హార్డ్ నోబెల్ (వర్ధంతి)



ఆల్ఫ్రెడ్ బెర్న్‌హార్డ్ నోబెల్ 1833 అక్టోబరు 21న జన్మించారు. స్వీడిష్ దేశానికి చెందిన కెమిస్ట్, ఇంజనీర్, ఆవిష్కర్త, వ్యాపారవేత్త, మానవతావాది. ఆయన 335 పేటెంట్‌లు కలిగి ఉండగా ప్రత్యేకించి డైనమైట్ ఎంతో ప్రత్యేక కలిగి ఉంది. రాయల్ స్వీడిష్ కాడమీ సైన్సెస్ సభ్యుడిగా ఎంపికయ్యారు. తను సంపాదించినది నోబెల్ ప్రైజ్‌కోసం కేటాయించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల సాధకులకు అత్యున్నతమైన నోబెల్ ప్రైజ్ ఇస్తున్నారు. 1896 డిసెంబరు 10న కన్నుమూశారు.

అశోక్‌కుమార్ (వర్ధంతి)



'పద్మభూషణ్' గ్రహీత అశోక్‌కుమార్ 1911 అక్టోబరు 13న బిహార్ రాష్ట్రం భగల్‌పూర్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు కుముద్‌లాల్ గంగూలీ. హిందీ సినీ రంగంలో తొలి సూపర్ స్టార్ గా నిలిచిన ఆయన హీరోగాను, విలన్‌గాను సత్తా చాటుకున్నారు. దాదామొనిగా పిలవబడ్డారు. 275కుపైగా సినిమాలు, 30కుపైగా బెంగాలీ నాటకాల్లో నటించారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2001 డిసెంబరు 10న కన్నుమూశారు.

ఇంటర్ విద్యార్థిని ప్రసవం

అనంతపురం వైద్యం, కళ్యాణదుర్గం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి ప్రాంతానికి చెందిన ఇంటర్ విద్యార్థిని కళ్యాణదుర్గంలో ప్రసవించింది. ఈ విషయం ఐసీడీఎస్ అధికారులకు తెలియడంతో చైల్డ్‌లైన్‌కు వివరాలను తెలియజేశారు. ఓ జూనియర్ కళాశాలలో చదువుతున్న బాలిక, అదే ప్రాంతానికి చెందిన బాలుడి కారణంగా గర్భం దాల్చింది. ఈ విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు కళ్యాణదుర్గం ప్రాంతంలోని తమ బంధువుల ఇంటికి బాలికను పంపారు. బాలికను, శిశువును, కుటుంబ సభ్యులను అధికారులు సఖి కేంద్రానికి తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసు నమోదు చేయాలని తాడిపత్రి పోలీసులకు సిఫార్సు చేశారు.

సైబర్ నేరగాళ్ల బారిన ప్రైవేట్ ఉద్యోగి

● రూ.80వేలు మాయం

సోమందేపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన ప్రైవేట్ ఉద్యోగికి మొబైల్‌లోని వాట్సప్‌కు మెసేజ్ వచ్చింది. మెసేజ్‌ను చదివిన అతను గుర్తుతెలియని వ్యక్తులతో చాటింగ్ చేశాడు. అనంతరం వారు పంపిన లింక్‌ను క్లిక్ చేయడంతో తన ఖాతా నుంచి రూ.80వేలు మాయమైనట్లు గ్రహించాడు. డబ్బులు కట్‌అయినట్లు మెసేజ్ రావడంతో ఉలిక్కిపడ్డాడు. బ్యాంక్ మినీ స్టేట్‌మెంట్ చెక్‌చేయగా సైబర్ నేరగాళ్లు నగదును తమ ఖాతాలోకి బదిలీ చేసుకున్నట్లు గ్రహించి లబోదిబోమన్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు తెలుపగా పుట్టపర్తిలోని సైబర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలని తెలిపారు. విషయం తెలిస్తే పరువు పోతుందని భావించి వివరాలు వెల్లడించలేదని వాపోయాడు.

డిగ్రీలో ఇద్దరు డీబార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 3, 5వ సెమిస్టర్‌లో పరీక్షల్లో ఇద్దరిని డీబార్ చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గుత్తిలోని ఎంఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, హిందూపురంలోని బాలాజీ విద్యామందిర్‌లో ఒకరు కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబార్ చేసినట్లు ఆయన తెలిపారు.

22 నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ పరిధిలోని పీజీ 3వ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 22 నుంచి ప్రారంభమవుతున్నట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య జీవీ రమణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎస్కేయూతో పాటు అనుబంధ కళాశాలలైన నగరంలోని శ్రీవాణి, పీవీకేకే, హిందూపురంలోని కళాశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు.

నేనే నిజమైన ప్రతిపక్షనేతను: యత్నాళ్



బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'నేనే నిజమైన ప్రతిపక్షనేతనని' అడ్జస్ట్‌మెంట్ రాజకీయ నేతను కానని విజయపుర ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ మండిపడ్డారు. మంగళవారం బెళగావి శాసన సభ సమావేశాలలో ప్రశ్నోత్తరాల వేళ రాష్ట్రంలో సాగునీటి పథకాలకు సంబంధించి భూస్వాధీన ప్రక్రియపై ఆయన ప్రసంగించారు. కృష్ణా ఎగువ ప్రాజెక్టు నిర్మాణాలు జరిగి ఆరు దశాబ్దాలు పూర్తయినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. ప్రధానంగా కృష్ణా నదికి అనుబంధంగా మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి పాలనలో ప్రారంభమైందని ఇప్పటికి ఆరు దశాబ్దాలు ముగిసినా ఇంకా మూడోవిడత పనులు చేపట్టలేదన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఉత్తరకర్ణాటకకు శాశ్వతంగా సాగు, తాగునీరు సాధ్యం కానుందన్నారు. ముంపు పరిహారం, పునరావాసం, కాలువల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. వీటికి రూ.70వేల కోట్ల మేర పరిహారం ఖర్చు కానుండగా ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు మరో రూ.50వేల కోట్లు అవసరమన్నారు. ఇలా కృష్ణా ఎగువ ప్రాజెక్టుకు కనీసంగా రూ.1.20లక్షల కోట్లు అవసరం కానుందన్నారు. ఎన్నేళ్ళకు గ్రాంట్లు మంజూరు సాధ్యం కానుందన్నారు. 2023లోనే పరిహారానికి సంబంధించి కోర్టు అవార్డుకు అనుబంధంగా ఇవ్వాలన్నారు. పరిహారం విషయంలో కోర్టు సూచించిన మేరకు ఇవ్వాలని పట్టుబట్టారు. ఇదే విషయమై జలవనరుల శాఖా మంత్రి డీకే శివకుమార్ అభ్యంతరం తెలిపారు. దీనిపై యత్నాళ్ మాట్లాడుతూ కోర్టు సూచించిన విధంగా పరిహారం ఇవ్వలేమని చెప్పడం సరికాదన్నారు. ఇదే విషయమై గతంలో కృష్ణా నదికి అనుబంధంగా ఉండే మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు అభ్యంతరం తెలిపాయన్నారు. ప్రాజెక్టు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం పరిహారం విషయంలో కోర్టు తీర్పును పాటించలేమని చెప్పడం సమంజసం కాదని సభనుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు యువత బలి...

సమాజంలో ఆన్‌లైన్ గేమ్‌లకు యువత బలవుతున్నారని ఇటీవల హాసన్ జిల్లాలో పలు కేసులు నమోదైన విషయాన్ని సకలేశపుర ఎమ్మెల్యే సిమెంట్ మంజు సభలో ప్రస్తావించారు. ఆన్‌లైన్ గేమ్‌లు, సైబర్ నేరాలను నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే విషయమై హోంమంత్రి పరమేశ్వర్ వివరణ ఇస్తూ 2023లో 22,255 సైబర్ నేరాలు నమోదు కాగా 2024వ ఏడాది 22,478 కేసులు, 2025లో ఇంతవరకు 13000ల కేసులు నమోదైనట్లు తెలిపారు. గడిచిన మూడేళ్ళతో పోల్చితే కేసులు తగ్గినట్లే అన్నారు. కాగా మూడేళ్లలో 10,717 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇదే సందర్భంలోనే బీజేపీ సభ్యుడు సునీల్‌కుమార్ జోక్యం చేసుకుని వచ్చేనెలలో ముఖ్యమంత్రి ఎవరు అనే అంశంపైనా అన్నివర్గాలు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని ముందుగా ఎవరనేది నిర్ధారిస్తే బాగుంటుందన్నారు. దీంతో స్పీకర్ ఇటువంటి వ్యాఖ్యలు సరికాదన్నారు.

కబడ్డీ క్రీడాకారిణికి సన్మానం

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఢాకాలో మహిళా కబడ్డీ వరల్డ్‌కప్‌లో బంగారుపతకం సాధించిన భారతజట్టులోని రాష్ట్ర క్రీడాకారిణి ధనలక్ష్మి పూజారిని సువర్ణసౌధలో సీఎం సిద్దరామయ్య అభినందించారు. మంగళవారం శాసనసభ కలాపాలను వీక్షించేందుకు విచ్చేసిన ఆమెను, కోచ్‌ను సత్కరించారు. ప్రభుత్వం ఆమెకు ఇప్పటికే రూ.5లక్షల రివార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా హోం మంత్రి పరమేశ్వర్ తదితరులు ఉన్నారు.



సీఎంతో క్రీడాకారులు, తదితరులు

కాంగ్రెస్ సీఎం డీకే శివకుమార్..!

● ఎమ్మెల్సీ హట్టిహోళి ట్వీట్‌పై ఆగ్రహం



విమానాశ్రయంలో డీకే శివకుమార్‌ను స్వాగతిస్తున్న ఎమ్మెల్సీ హట్టిహోళి

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎవరనేది అంతుచిక్కని విషయంగా మారిందని బీజేపీ సభ్యుడు అరవింద బెల్లద్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ చన్నరాజ్ హట్టిహోళి ఏకంగా డీకే శివకుమార్ సీఎం అంటూ ఎక్స్‌లో పోస్టు చేశారన్నారు. సాంబ్రా విమానాశ్రయంలో డీకే శివకుమార్‌ను ఆయన స్వాగతించారు. ఇందుకు సంబంధించిన ఫొటోను సోషల్‌మీడియాలో మంగళవారం షేర్ చేసుకున్నారు. స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ సోదరుడైన ఎమ్మెల్సీ హట్టిహోళి తీరుపట్ల విమర్శలు వ్యక్తం అయ్యాయి. ఏకంగా ముఖ్యమంత్రి పేరునే మార్చేసి ట్వీట్ చేయడం ఎంతవరకూ సమంజసమన్నారు. వివాదం కావడంతో సదరు పోస్టును ఎడిట్ చేశారు.

20 మంది జూదరుల అరెస్టు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకటాంపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం రూరల్ పోలీసులు, అనంతపురం స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న 20 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18,92,040 నగదు, ఒక కారు, 24 సెల్ ఫోన్లు, 17 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌ఐ రాఘవేంద్రప్ప తదితరలు పాల్గొన్నారు.

శిశుగృహలో ఉద్యోగావకాశాలు

అనంతపురం వైద్యం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహలో ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ అరుణకుమార్ తెలిపారు. శిశుమరణంతో ఇటీవల శిశుగృహలోని సిబ్బందిని తొలగించామని, కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు ఖాళీ పోస్టులను కాంట్రాక్ట్, పార్ట్‌టైం ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఈ నెల 13, 14వ తేదీలు సెలవు రోజులైనా దరఖాస్తులను తీసుకుంటామని తెలిపారు. ఐసీడీఎస్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులను ఇవ్వవచ్చునని తెలిపారు.

రెండోరోజూ అంతే..!

● పీజీ స్పాట్ అడ్మిషన్లకు 20 మంది హాజరు

● నేడూ అడ్మిషన్లు



అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో నిర్వహిస్తున్న పీజీ మిగులు సీట్ల స్పాట్ అడ్మిషన్లకు రెండోరోజు స్పందన కరువయింది. మంగళవారం ఉదయం 10 గంటలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించారు. సాయంత్రంలో ముగిసేలోపు 20 మంది మాత్రమే అడ్మిషన్లు పొందారు. రెండ్రోజుల పాటు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియలో 29 విభాగాలలో ఖాళీగా ఉన్న 808 సీట్లకు మొత్తం 128 మంది అడ్మిషన్లు పొందినట్లు అధికారులు తెలిపారు. వీరిలో ఎంత మంది ఫీజులు చెల్లించారన్న దానిపై స్పష్టత కొరవడింది. ఈ నేపథ్యంలోనే అడ్మిషన్ పొందిన విద్యార్థుల సంఖ్యను అధికారికంగా అధికారులు నిర్ధారించలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీనిపై అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ నరసింహన్‌ను వివరణ కోరగా... ఎంత మంది కట్టారన్నది ఇప్పుడే చెప్పలేమని, ప్రక్రియ ముగిసిన తరువాత ప్రకటిస్తామని చెప్పుకొచ్చారు. అడ్మిషన్ల ప్రక్రియ బుధవారం కూడా కొనసాగనున్నట్లు ఆయన తెలిపారు.

హైస్కూల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

» పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్ కాళనాయకనహళ్లి భీమేశ్

శిడ్లఘట్ట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నమ్మూర ప్రభుత్వ పాఠశాలలో 240మందికిపైగా ఉన్నారని, తాలూకాలో అత్యధిక పిల్లలు ఉన్న రెండో ప్రభుత్వ పాఠశాల మనదని ఇందుకు హైస్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్ కాళనాయకనహళ్ళి భీమేశ్ తెలిపారు. తాలూకాలోని కుంభిగానహళ్ళి (హెచ్‌క్రాస్) గ్రామపంచాయతీ కాళనాయకనహళ్ళిలో నూతనంగా నిర్మించిన మాదిరి అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కాళనాయకనహళ్ళి చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలల దూరం, విద్యార్థుల సంఖ్య ఇతర సమాచారాన్ని అధికారులకు ఇచ్చామన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్‌తో చర్చింగా సానుకూలంగా స్పందించారన్నారు. పాఠశాల పట్ల శ్రద్ధ ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్‌డీఎంసీ సభ్యులు, అధికారుల సహకారంతో పాఠశాల ఉత్తమంగా ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా పాఠశాల ప్రగతికి అందరూ సహకరించాలన్నారు. ప్రాథమిక పూర్వస్థాయినుంచి చదువుకు పునాదులు అంగన్‌వాడీ కేంద్రాలన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు ఈ కేంద్రాలు ఉపకరిస్తాయన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ, పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తూ చదువుకు ఉత్తమ వాతావరణం కల్పిస్తున్నాయని, ప్రైవేట్ వ్యామోహంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు రమేశ్, మంజయ్య, గ్రామపంచాయతీ సభ్యుడు రామదాస్, మంజునాథ్, రామచంద్రప్ప, విశ్వనాథ్, మునిస్వామిగౌడ, రామచంద్రప్ప, అంగన్‌వాడీ కార్యకర్త అంబికా, సీడీపీఓ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రామప్రముఖులకు ఆత్మీయ సన్మానం

'కువెంపు'నకు భారతరత్న ఇవ్వాలి

» కువెంపు విశ్వమానవ క్షేమాభివృద్ధి ట్రస్టు డిమాండ్

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్యంలో 20వ శతాబ్దంలో జాతీయకవి పురస్కార గ్రహీత 'కువెంపు' (కుప్పళ్ళి వెంకటప్ప పుట్టప్ప) నకు భారతరత్న ఇవ్వాలని కువెంపు విశ్వమానవ క్షేమాభివృద్ధి ట్రస్టు డిమాండ్ చేసింది. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ట్రస్టు అధ్యక్షుడు హెచ్‌కే రాము, పంప పురస్కృత నాడోజ హంప నాగరాజయ్య, ప్రొఫెసర్ చంద్రశేఖర కంబార, నాడోజ సీపీకే, డాక్టర్ జీటీ ప్రభాశంకర్‌ప్రేమి, ప్రొఫెసర్ సీ నాగణ్ణ, కేటీ వీరప్పలు మీడియాతో మాట్లాడారు. కన్నడలో రెండో జ్ఞానపీఠ పురస్కార గ్రహీత అని పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారన్నారు. కర్ణాటక రాష్ట్ర గీతమైన 'జయభారత జననియ తనుజాతె' ఆయన రచించినదే అన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ భారతరత్న ప్రకటించాలని కోరుతూ త్వరలోనే ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వినతిపత్రం అందచేస్తామన్నారు.



మీడియాతో నాడోజ హంప నాగరాజయ్య తదితరులు

ఎక్స్‌కాన్‌లో అధునాతన వాహనాల ప్రదర్శన

బెంగళూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)లో ఎక్స్‌కాన్ ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. ఈనెల 13వరకు ప్రదర్శన కొనసాగనుంది. స్యాని ఇండియా ఎక్స్‌కాన్ 2025లో నిర్మాణ, భారీ ఉపకరణాలు ప్రదర్శించారు. వికసిత భారత్ 2047 లక్ష్యంగా మరిన్ని ఉత్పత్తులు అందుబాటులోకి రానున్నాయి. ఇంజనీరింగ్, డిజిటల్, ఏఐ, పర్యావరణ స్నేహి అంశాలు మిళితంగా వాహనాలు అందుబాటులోకి తెచ్చినట్టు స్యాని ఇండియా, దక్షిణ ఆసియా ఉపాధ్యక్షుడు, ఈడీ దీపక్ గర్గ్ తెలిపారు. గనుల తవ్వకాలతోపాటు భారీ నిర్మాణాలకు దోహదపడే హెవి-డ్యూటీ ఎలక్ట్రిక్ లాజిస్టిక్స్, ఎలక్ట్రిక్ ఉపకరణాలు ప్రదర్శనలో ఉంచారు. అభివృద్ధి చక్రాలు అనే థీమ్‌తో ప్రదర్శన ఏర్పాటు చేశారు. స్యాని ఇండియా సీఓఓ సంజయ్ సక్సేనా తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రదర్శనలో టాటా మోటార్స్ సంస్థ ఆధునికత, సుస్థిరత, ఏఐతో కూడిన విధానాలతో సరికొత్త యంత్రోపకరణాలను అందుబాటులోకి తెచ్చింది. తన అత్యంత శక్తిశాలి టిప్పర్ ప్రైమా 354 కేను విడుదల చేసింది. ప్రొడక్టివిటీ అన్‌లీష్డ్ అనే నినాదంతో యంత్రాలు, ఉత్పత్తులను ప్రదర్శింపచేశారు.



ప్రదర్శనలో టాటా ప్రైమా వాహనం

ఆటో, లారీ ఢీ - వృద్ధుడి మృతి



ఘటనా స్థలమిదే..

బాగేపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆగియున్న ఆటోను లారీ ఢీ కొన్న ఘటనలో హిందూపురం తాలూకా లేపాక్షి మండలం చిలువెందులకు చెందిన ఆదిమూర్తి (80) అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం పట్టణ శివారులో జాతీయ రహదారి 44పై సాయిబాబా మందిరం మలుపులో ఆగియున్న ఆటోను లారీ ఢీ కొంది. ప్రమాదంలో 13మంది గాయపడ్డారు. చిలువులపల్లికి చెందిన వారు సుంకులమ్మదేవి ఆలయానికి వచ్చారు. ఆలయం నుంచి హోటల్‌కు వెళ్లేందుకు ఆటోలో వచ్చారు. సాయిబాబా మందిరం వద్ద ఆటో యూటర్న్ తీసుకునేందుకు నిలిపాడు, వెనుక నుంచి బైక్‌పై ఇద్దరు వచ్చారు. వీరిని తప్పించే యత్నంలో లారీ, ఆటోను ఢీ కొంది. ఆటోలో ఉన్న వృద్ధుడు కిందపడగా, అతడిపై నుంచి బస్సు దూసుకెళ్లింది. దీంతో ఆదిమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు, ఆటోలో ఉన్న మిగిలిన ప్రయాణీకులు గాయాలతో బయటపడ్డారు. వీరిని బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చిక్కబళ్ళాపుర జిల్లా ఆసుపత్రికి తరలించినట్టు పట్టణ పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ కుశాల్ చౌక్సి, ఏఎస్పీ జగన్నాథ్‌రై, ఎస్సై సునీల్‌కుమార్‌లు పరిశీలించారు. బాగేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆదిమూర్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

నెట్‌వర్క్ సమస్యపై ఆగ్రహం



ఎయిర్‌టెల్ కస్టమర్ సెంటర్‌లో వాగ్వాదం

దొమ్మసంద్ర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవలికాలంలో మొబైల్ లేకుండా గడిచే పరిస్థితి లేదు. అయితే ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర గ్రామంలో ఎయిర్‌టెల్ మొబైల్ నెట్‌వర్క్, వై-ఫై కనెక్షన్ సరిగా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దొడ్డతిమ్మసంద్రకు చెందిన మంజునాథ్ ఐదు రోజులక్రితం వై-ఫై కనెక్షన్‌కోసం రూ.1500 డిపాజిట్ చేశారు. అయితే ఇంతవరకు కనెక్షన్ ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. ఇంటర్నెట్ లేకుండా ఆఫీసు కార్యకలాపాలకు ఇబ్బందిగా ఉందని, వై-ఫై కనెక్షన్‌కోసం అప్లై చేశామన్నారు. మంగళవారం ఎయిర్‌టెల్ కస్టమర్ కేర్ సెంటర్‌కు వెళ్లగా మీ ప్రాంతంలో 5జీ కనెక్షన్ లేదని, అందుకే వై-ఫై కనెక్షన్ సాధ్యం కాలేదని త్వరలోనే మీ డిపాజిట్ వాపసు ఇస్తామని బదులిచ్చారని మంజునాథ్, సుష్మా దంపతులు ఆగ్రహం విచారం వ్యక్తం చేశారు. సరైన నెట్‌వర్క్ లేకుంటే డిపాజిట్ ఎందుకు కట్టించుకున్నారని మండిపడ్డారు.

ఆర్టీసీ బస్సు బోల్తా.. కండక్టర్ మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు


(5వ పేజీ తరువాయి) వెళ్లె విద్యార్థులు ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాగా బెళగావిలో జరుగుతున్న శీతకాలం శాసనసభ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ బస్సు ప్రమాదం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కండక్టర్ కుటుంబానికి తమ ప్రఘాడ సానుభూతిని ఫోన్ ద్వార ఆమె తెలియజేశారు. గాయపడిన విద్యార్థులకు వెంటనే సరైన చికిత్సనందించాలని సూచించారు. అదే సమయంలో మృత్యువాతపడిన కండక్టర్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. సంఘటనకు సంబంధించి దేవదుర్గ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.



కండక్టర్ బసవరాజ్(ఫైల్)

ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం

సిరుగుప్ప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో మంగళవారం బీజేపీ పార్టీ ఆదేశాల మేరకు తాలుకా వ్యాప్తంగా ప్రతి ఇంటికి బీజేపీ స్టిక్కర్లను అంటించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు విజయేంద్ర ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యకర్తలు ఈ కార్యక్రమం విజయవంతంగా సాగేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ తాలుకా అధ్యక్షులు మల్లికార్జున స్వామి, బీజేపీ రైతు సంఘం మోర్చ అధ్యక్షులు శివరామగౌడ, జిల్లా బీజేపీ యూత్ అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప, పట్టణ పంచాయతీ కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1620.94	1629.45
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4.055	550
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,455	5,175
నీటి నిల్వ (టీఎంసీలు)	64.00	92.02

ఆయుర్వేద రథయాత్రకు వీడ్కోలు



బళ్లారికి చేరుకున్న ఆయుర్వేద రథం

బళ్లారి సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోని ఏడు రాష్ట్రాల్లో పర్యటిస్తున్న ఆయుర్వేద రథయాత్రకు మంగళవారం నగరంలో వీడ్కోలు పలికారు. 'మంచి ఆరోగ్యానికి ఆయుర్వేదం' పేరుతో ఈనెల 25నుంచి 28 వరకు బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో జరగనున్న ప్రపంచ ఆయుర్వేద సదస్సు గురించి అవగాహన కల్పించడానికి ఈ రథయాత్ర చేపట్టారు. ఉదయం నగరంలోకి ప్రవేశించిన రథానికి తారానాథ్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య ఆసుపత్రి ముందు వైద్య సిబ్బంది , విద్యార్థులు స్వాగతం పలికారు. రథయాత్ర ప్రాముఖ్యతను తెలియజేస్తూ రథానికి ప్రత్యేక పూజలు, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. రథ ప్రతినిధి డాక్టర్ మంజునాథ్ యొక్క ఉద్దేశాన్ని వివరించారు. ప్రపంచ ఆయుర్వేద సమావేశం యొక్క అవశ్యకత , ఆయుర్వేదం యొక్క ప్రపంచ ఔచిత్యం గురించి ఆయన మాట్లాడారు. డాక్టర్ రాజశేఖర్ గనిగేర మాట్లాడుతూ ఆయుర్వేద వారసత్వం, విజ్ఞానం, భవిష్యత్తు అవకాశాల గురించి ప్రశంసించారు. డాక్టర్ శివు అరికేరి మాట్లాడుతూ ఆయుర్వేద రంగానికి పండిట్ తారనాథ్ కృషిని గుర్తు చేసుకున్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రవి చవాన్ తదితరులు హాజరయ్యారు. అనంతరం రథం ఆంధ్రప్రదేశ్ వైపు తరలింది.

బాల్యవివాహ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

● అధికారులకు కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ ఆదేశం ● గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచన

బళ్లారి సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చట్టపరమైన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం నగరంలోని జిల్లా పరిపాలన భవన ఆడిటోరియంలో నిర్వహించిన మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ , జిల్లా బాలల రక్షణ యూనిట్ ప్రగతి సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ఇటీవల బాల్య వివాహాలు పునరావృతమవుతున్నాయని, ఇది చట్టవిరుద్ధమన్నారు. బాల్య వివాహాలు జరిగితే వారిపై తీసుకోగల కఠినమైన చర్యల గురించి పల్లెల్లో అవగాహన కల్పించాలన్నారు. బాలికలు నిరంతరం పాఠశాల విద్యకు గైర్హాజరవుతున్నట్లు గుర్తిస్తే తల్లిదండ్రులను సంప్రదించి కారణాన్ని తెలుసుకోవాలన్నారు. దీని ద్వారా పిల్లల గురించి సమాచారం లభిస్తుంది.బాల్య వివాహాలు జరగకుండా మనం జాగ్రత్తలు తీతసుకోగలమన్నారు. జిల్లాలో పదవతరగతి పరీక్ష ఫలితాలు పెంచడానికి ప్రతి పాఠశాలను పర్యవేక్షించడానికి జిల్లాస్థాయి అధికారులను నియమించామన్నారు.

జిల్లాపంచాయతీ సీఈఓ మహమ్మద్ హారీస్ మాట్లాడుతూ సండూర్ ప్రాంతం , బళ్లారి తాలూకాలోని చోరనూర్, బండ్రి, మెట్రిక్, విఠలాపురం,తారానగర్, శిడగినమోళ గ్రామ ప్రాంతాలలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని , ఈప్రాంతంలో గర్భిణీలు 35కిలోల బరువు మాత్రమే ఉండటం విచారకరమన్నారు. ఈసందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ సివిల్ న్యాయాధికారి రాజేశ్ హొసమనె, అదనపు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నవీన్‌కుమార్, మహిళా శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ, జిల్లా బాలల రక్షణ అధికారి సుభద్రాదేవి, బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ త్రివేణిపత్తార్, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, స్వచ్ఛంద సంస్థల ఆఫీస్ బేరర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలి : ఏఐడీఎస్‌ఓ

హోస్పేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల విలీనం పేరుతో గ్రామీణ విద్యను కుదేలుచేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అక్టోబర్ 15న ప్రభుత్వం జారీ చేసిన కెపీఎస్ మాగ్నెట్ సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐడీఎస్‌ఓ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం హోస్పేట్‌లో ఏఐడీఎస్‌ఓ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. మంత్రులు సభలో ఒక మాట శాఖ ఆదేశాలు మరో మాట ప్రజలు ఎవరిని నమ్మాలి అని మండిపడ్డారు. బెళగావి సెషన్‌లో విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప ప్రభుత్వ పాఠశాలలను మూసేయం అనే మాటలు సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్నది అవాస్తవం అని స్పష్టం చేశారు. అయితే అదే సమయంలో అక్టోబర్ 15న శాఖ జారీ చేసిన సర్క్యులర్‌లో తక్కువ మంది ఉన్న పాఠశాలలను సమీపంలోని కేపీఎస్ మాగ్నెట్ స్కూళ్లలో విలీనం చేయాలని పేర్కొనడం ఎందుకు అన్నారు. అనేక గ్రామాల్లో పాఠశాలలు మూత పడే పరిస్థితి ఎదురవుతుందన్నారు. సర్క్యులర్ వెనక్కు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. మాటలు కాదు ప్రభుత్వం లిఖితపూర్వక ఉత్తర్వు జారీచేయాలి అని డిమాండ్ చేశారు. మంత్రులు చెప్పే మాటలకు విరుద్ధంగా ఇప్పటికే గ్రామాల్లో పాఠశాలలు మూసివేస్తున్నారన్నారు. ఇది గ్రామీణ విద్యను అణగదొక్కే విధానమే అన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలంటే పాఠశాలలను మూసివేయడం కాదు ఉపాధ్యాయులను వసతులను పెంపొందించడం అవసరమన్నారు. ప్రజా సంస్థలు, తల్లిదండ్రులు అందరూ ఐక్యంగా నిలబడాలని వారు పిలుపునిచ్చారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

మానవీయ దృక్పథంతో పరిశీలించండి

● కుడితిని భూ బాధితుల సమస్యపై ఎమ్మెల్సీ సతీష్

బళ్లారి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) బళ్లారి జిల్లా కుడితిని వద్ద పరిశ్రమల కోసం రైతులు నుంచి భూములు తీసుకుని వారికి సరైన పరిహారం ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, మూడేళ్లగా రైతులు ఆందోళన చేస్తున్నా ఫలితం లేకుండా పోయిందని ఎమ్మెల్సీ వై.ఎం. సతీష్ అన్నారు. బెళగావిలో జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో మంగళవారం ఆయన పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్‌ను ప్రశ్నించారు. కుడితిని వద్ద మిత్తల్, ఉత్తమ్ గాల్వా, ఎన్ఎండీసీ ఇలా అనేక కంపెనీలు ప్రారంభించడానికి రైతుల నుంచి భూములు కొనుగోలు చేశారన్నారు. పరిశ్రమలు వస్తాయి, ఇంటికో ఉద్యోగం వస్తుందనే ఆశతో రైతులు భూములు ఇచ్చారన్నారు. కానీ ఇంత వరకూ ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పకపోగా, పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నాయన్నారు. రైతు సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. మంత్రి ఎంబీ పాటిల్ మాట్లాడుతూ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు



దుకాణాల్లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ తనిఖీ బోర్డు , కలబురగి డివిజన్ వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ నేతృత్వంలోని బృందం మంగళవారం జిల్లాలోని వివిధ వ్యవసాయ పనిముట్ల అమ్మకాల దుకాణాలు, గోడౌన్లపై దాడులు నిర్వహించారు. ఎరువులు, పురుగుమందులను అక్రమంగా విక్రయిస్తున్న దుకాణాల్లకు నోటీసులు జారీ చేశారు. బళ్లారి వ్యవసాయ జిల్లా, ఇక్కడ ప్రధాన వ్యవసాయ పంటలు వరి, మొక్కజొన్న, జొన్న, శనగలు, ప్రధాన ఉద్యాన పంటలు మిరపకాయలు,అంజూరు ఇతర పంటలుపండిస్తారు. నగరంలో సేంద్రియ ఎరువులను చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నారని విజిలెన్స్ జాయింట్ డైరెక్టర్ శివకుమార్ తెలిపారు. సరైన వివరణ ఇవ్వకపోతే సంబంధిత అమ్మకాల దుకాణాలు సంస్థలపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈదాడిలో డిప్యూటీ అగ్రికల్చర్ డైరెక్టర్ మృత్యుంజయ,అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్, అగ్రికల్చర్ కార్యాలయ వ్యవసాయ అధికారులు, సౌమ్య, బసవరాజ్, సుష్మ, ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

ఏనుగుల సంచారంతో రైతుల్లో ఆందోళన



డెంకణీ కోట వద్ద ఏనుగుల మంద

హోసూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డెంకణీకోట అటవీ ప్రాంతం నుంచి 30 కి పైగా ఏనుగులు ఊడేదుర్గం అటవీ ప్రాంతానికి తిరిగి రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో కర్ణాటక అడవుల నుంచి తమిళనాడులోని జవలగిరి అడవుల గుండా 50 ఏనుగులు డెంకణీకోట అడవులకు వలస వచ్చాయి. ఏనుగులు రాయకోటలోని డెంకణీకోటై అటవీప్రాంతానికి చెందినవి. రాయకోట అటవీ అభయారణ్యం పరిధిలోని ఊడేదుర్గం మీదుగా హోసూరు అటవీ అభయారణ్యంలోని శానమావు అటవీప్రాంతానికి ఏనుగులు వలస వచ్చాయి. తర్వాత ఏనుగులు వేర్వేరు గుంపులుగా విడిపోయి అడవికి సమీపంలో ఉన్న పంటలను దెబ్బతీశాయి. తరువాత అటవీశాఖ ఏనుగులను ఒకచోట చేర్చి డెంకణీకోట అటవీప్రాంతానికి వలస వచ్చాయి. కానీ తిరిగి వెళ్లేటప్పుడు అవి ఊడేదుర్గం, శానమావు అటవీప్రాంతాల వద్ద మకాం చేశాయి. సోమవారం రాత్రి 30కి పైగా ఏనుగులు డెంకణీకోట అటవీ ప్రాంతం చేరుకున్నాయి. ఏనుగుల దాడులనుంచి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

నగరంలో మేయర్ పర్యటన



15వ వార్డులో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మేయర్ సత్య

హోసూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ 15వ వార్డు పరిధిలోని ద్వారకానగర్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతాలలో మురుగునీటి కాలువ, వీధి దీపాలు, రోడ్డు సౌకర్యాలు కల్పించాలన్న స్థానికుల వినతి మేరకు మేయర్ సత్య స్వయంగా వార్డులో పరిశీలించారు. స్థానికుల సమస్యలను ఆలకించి వినతులు స్వీకరించారు. పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. కౌన్సిలర్ డాక్టర్ శ్రీలక్ష్మి నవీన్, జిల్లా కార్యదర్శులు మోహన్‌బాబు, మోహన్, డీఎంకే కార్యనిర్వాహకులు, శంకర్, కదిరవన్ మనోహరన్, ద్వారకా నగర్ ఎక్స్‌టెన్షన్ అసోసియేషన్ కార్యనిర్వాహకులు ప్రభాకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

హోసూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హోసూరులో వరసిద్ధి వినాయక దుర్గా అమ్మవారి ఆలయంలో ఏటా 10, 12వ తరగతి విద్యార్థులకోసం ప్రత్యేక పూజలు చేస్తారు. సరస్వతి హోమం నిర్వహించారు. ఫిబ్రవరిలో నిర్వహించిన హోమంలో పాల్గొన్న వారు అత్యధిక మార్కులు సాధించిన సందర్భంగా మంగళవారం ప్రత్యేకంగా బహుమతులు అందచేసి అభినందించారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఆర్ముగం అధ్యక్షత వహించారు. పదో తరగతిలో హరిణి, శబరివాసన్‌లు ప్రథమ బహుమతుని, అనుశివాసన్‌కు ద్వితీయ బహుమతిని, షణ్మితకు తృతీయ బహుమతి అందచేశారు. 12వ తరగతిలో షారుఖ్, కౌసల్య మొదటి బహుమతిని పొందగా, రితేష్ రెండో బహుమతిని, పూర్ణ మూడో బహుమతిని పొందారు. ఇతర విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. విద్యార్థులందరికి సర్టిఫికెట్లు, పుస్తకాలు, మిఠాయిలు పంపిణీ చేశారు.

పరీక్షలను ధైర్యంగా ఎదుర్కోవాలి: డీహెచ్‌ఓ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీహెచ్‌ఓ రమేశ్‌బాబు

బళ్లారి సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొనాలని, మానసికంగా ఆందోళన చెందరాదని జిల్లా ఆరోగ్య కుటుంబసంక్షేమ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు సూచించారు. మంగళవారం నగరంలోని సెయింట్ జోసెఫ్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులు స్ఫూర్తిదాయక ప్రసంగం ఇచ్చారు. అభ్యాస ఇబ్బందులను పరీక్షలను సులభంగా ఎలా అధిగమించాలో తగిన మార్గదర్శకత్వం అందించారు. పరీక్షలుసామర్థ్యాన్ని పరీక్షించవని, బదులుగా మీ దృఢ సంకల్పాన్ని , క్రమశిక్షణను పరీక్షిస్తాయన్నారు. ఆత్మవిశ్వాసం, సమష్టి కృషి అవసరమన్నారు. ఒత్తిడి సహజం ఆందోళనకు లొంగకుండా, కష్టపడి పనిచేస్తే ఖచ్చితంగా ఫలితాలు వస్తాయన్నారు. ఇది మీ జీవితంలో చివరి పరీక్ష కాదు చింతకించకండి మీరు అవగాహననతో చదువుకోవాలి, మీ సామర్థ్యాలను నమ్మాన్నారు. పరీక్షకు ఎలా సిద్ధం కావాలో, ప్రశ్నలకు సులభంగా సమాధానం రాయాలో, అధిక మార్కులు సాధించడం గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగాపాఠశాల ప్రదానోపాధ్యాయురాలు దేవదానమ్మ, ఇన్‌చార్జ్ జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఖుర్షీద్ బేగం, ఎయిడ్స్ సూపర్‌వైజర్ గిరీశ్, జగదీశ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోవధ నిషేధ బిల్లు సవరణపై ఆగ్రహం

● ఆందోళన చేపట్టిన వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ● ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సభ్యులు

బళ్లారి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో గోవధ సవరణను నిషేధిస్తూ భారీ నిరసన చేపట్టింది. మంగళవారం చేపట్టిన నిరసనలో విశ్వహిందూ పరిషత్ తాలుకా అధ్యక్షుడు దేవరాజ్ పాటిల్ జిల్లా ధర్మప్రచార ప్రముఖులు విశ్వనాథ్ చౌదరి నగర అధ్యక్షులు కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గో నిషేధ చట్టాన్ని అమలు చేయాలని, ఆవు పాలిస్తుందని, గోవులను కోయడం హిందూ ధర్మం కాదని వారు నినాదాలు చేశారు. సవరణ బిల్లును తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింధనూరు తాలుకా రాష్ట్ర భజరంగదళ్ అధ్యక్షులు సభ్యులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తాలుకా కార్యదర్శి మనోహర్ వీరభద్ర తాలుకా కోఆర్డినేటర్ డీఎస్ఆర్ రాఘవేంద్ర గిరిజ ఉదయ్ కుమార్, వీరేష్ నాయక్, మల్లయ్య, రుద్రయ్య, మహేష్, దేశాయ్, అయ్యప్ప, శ్రీనివాస్ లింగన్న తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుల సంఘం అధ్యక్షుడిగా దొడ్డ మంజునాథ్



నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, సభ్యులను అభినందిస్తున్న పాత్రికేయులు

కంప్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కంప్లి తాలుకా పాత్రికేయుల సంఘం నూతన అధ్యక్షుడిగా బంగి దొడ్డ మంజునాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని జిల్లా అధ్యక్షుడు వీరభద్ర గౌడ, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి తెలిపారు. కంప్లి అతిథి గృహంలో మంగళవారం పాత్రికేయులు సంగం పదాధికారుల నియామకం జరిగింది. అందులో అధ్యక్ష స్థానానికి బంగి దొడ్డ మంజునాథ నామినేషన్ వేశారు. అధ్యక్షస్థానానికి ఎవరు పోటీ లేనందువలన వారినే ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా కరి విరుపాక్షి, ప్రధాన కార్యదర్శిగా పి వీరేష్, కార్యదర్శిగా యమనప్ప, కోశాధికారిగా జీరు గాదిలింగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా పండితారాధ్య వెంకటేష్, విరుపాక్షయ్య స్వామి, రసూల్, చంద్రశేఖర్ నియామకమయ్యారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

సిరుగుప్ప, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ దమ్మూరు బసవరాజు కోరారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ గౌసియాబేగమ్ ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 24 వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా పూర్వాపరాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైద్యాధికారి బసవరాజు మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. బూత్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సంఘ సంస్థ పదాధికారులు, విద్యార్థులు ఈ కార్యక్రమంపై అవగాహన ర్యాలీ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్య శాఖాధికారి గురప్ప, వివిధ సంస్థల పదాధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బియ్యం స్వాధీనం



బియ్యం తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు


బళ్లారి రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): బళ్లారి నుంచి హోస్పేట కొప్పాళ కొత్త బైపాస్ వైపు అక్రమంగా తరలిస్తున్న సబ్సిడీ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఏపీకి దాదాపు 659 బస్తాలు 329 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడులు నిర్వహించిన పోలీసులు ట్రక్కు యజమాని, డ్రైవర్‌తో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఫుడ్ ఆఫీసర్ మంజునాథ్ రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఉదయరవి తదితరులు దాడుల్లో పాల్గొన్నారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'కళాకారులను ప్రోత్సహించాలి'

కంప్లి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : పురాతన కాలంలో సాంఘీక నాటకాలు, పౌరాణిక కథలను ప్రోత్సహించే వారని, ఆధునిక కాలంలోన కళలను ప్రోత్సహిచాఆలని సమాజ సేవకుడు అడవయ్య స్వామి అన్నారు. ఇప్పుడున్న మొబైలు, కంప్యూటర్లు, సినిమాలు, మోజులో పడి యువతరం పూర్తి మానసికంగా కానీ గురవుతున్నారని ముద్దటనూరు గ్రామ సమీపంలోని లక్ష్మీనగర్ క్యాంపులోని జయలత కళాట్రస్టు నిర్వహించిన హాస్య సామాజిక నాటకం ఆదివారం ప్రదర్శించారు. బయలత అకాడమీ సభ్యులు హార్మోనియం మాస్టర్ హెచ్ తిప్పేస్వామి మాట్లాడుతూ మాలాంటి కళాకారులు ఉన్నతస్థాయికి చేరుకోవడానికి ప్రేక్షకులే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వగురు బయలత ట్రస్ట్ అధ్యక్షుడు వై మల్లికార్జున, ప్రొఫెసర్ కృప సంఘ మాజీ అధ్యక్షుడు గోడే హేమావతి, శివాజీ రావు, పునీత్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాడిన రోకేయా

● వర్ధంతి సభలో ఏఐఎంఎస్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరి



మాట్లాడుతున్న ఏఐఎంఎస్ఎస్ అధ్యక్షురాలు ఈశ్వరి

బళ్లారి సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా విద్య, సమానత్వం కోసం కృషి చేసిన బేగం రోకేయా ఇప్పటికీ ఒక ప్రేరణ అని ఏఐఎంఎస్ఎస్(అఖిల భారత మహిళ సాంస్కృతిక సంఘం) జిల్లాధ్యక్షురాలు ఈశ్వరి అన్నారు. నగరంలోని మహమ్మదీయా బీఎడ్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన బేగం రోకేయా 93వ వర్ధంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బెంగాల్ సామాజిక సంస్కర్త , మహిళా విద్యకు మార్గదర్శకురాలు బేగం రోకేయా అనేక సవాళ్లను ఎదుర్కొన్నారని, అంతేకాకుండా అన్ని వర్గాల మహిళల హక్కుల కోసం పోరాడారన్నారు. అప్పట్లో ఆమె స్థాపించిన సఖ్వత్ మెమోరియల్ గర్ల్స్ స్కూల్ నేటికి లెక్కలేనన్ని మహిళలకు వెలుగుగా మారిందని, బేగం రోకేయా విద్య గురించి మాత్రమే కాకుండా మహిళల హక్కులు , ఆర్థిక స్వాతంత్ర్యం గురించి కూడా తన స్వరాన్ని వినిపించారన్నారు. జిల్లాకార్యదర్శి విజయలక్ష్మి మాట్లాడుతూ నేడు మహిళలు, పిల్లలపై నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ఇందుకు ప్రధాన కారణం అశ్లీల సినిమా సాహిత్యం, మద్యం, మాదకద్రవ్యాలు పెరిగిపోవడమేనన్నారు. ఇలాంటి వాటిపై అందరమూ పోరాడాలన్నారు. ఈసందర్భంగా కళాశాల ప్రొఫెసర్ పార్వతి, ఏఐఓఎస్ఎస్ ఆఫీసు బేరర్లు, సౌమ్య, కళాశాల బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బళ్లారి సిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాసవి విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వీరేశ్ మాట్లాడుతూ పిల్లల సంరక్షణ , ఆరోగ్యం ప్రతి విద్యార్థి హక్కు అని, ఏటా ఆరోగ్య పరీక్షల్లో భాగంగా ఈ సారి కూడా నిర్వహిస్తున్నామన్నారు. వైద్య శిబిరంలో నర్సరీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఎత్తు, బరువు, దృష్టిపరీక్ష, సాధారణ ఆరోగ్య తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యం గురించి తగిన సమాచారాన్ని తల్లిదండ్రులకు కూడా తెలియజేస్తామని వీరేశ్ అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బందికి పాఠశాల హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.